# నిరీక్షణ

## అమరనాధ్

'నేనింకా చదివి తీరుతాను నాన్నా' అని తండ్రి కెదురుగా నిలచి ఖచ్చితంగా చెప్పేశక్తి లేదు రామ్మూర్తికి. అందుచేతే ముఖాముఖీని మాట్లాడి లాభంలేదని నిశ్చయించుకున్నాడు. పోనీ చదువు మానేసి తండ్రి చెప్పినట్టు విందామా అంటే మనస్సొప్పదు. ఎల్లాగో అలాగ, ఆఖరికి తండ్రి నెదిరించేనాసరే చదివి తీరాలని నిశ్చయించుకున్నాడు యీ నిశ్చయాన్ని తండ్రికి తెలియ జెయ్యాలి. ఆలోచించాలోచించి కాగితం, కలం తీసుకుని రాయడం ప్రారంభించాడు—

'నాన్నా!' నామనసులోవున్న విషయం ఖచ్చితంగా రాస్తున్నా నాకిప్పుడప్పుడే ఉద్యోగం చెయ్యాలనిలేదు. యింకా చదవాలనివుంది కనుక చదివిస్తావని తలుస్తాను.

కనీసం బి. ఏ. డిగ్రి ఏనా పొందాలనివుంది. ఎల్లాగో కష్టపడి ఇంటర్మీడియట్ దాకా చెప్పించావు. యీ రెండు సంవత్సరాలుకూడా చెప్పిస్తే చాలా బాగుంటుంది. తప్పకుండా చదివిస్తా వని తలుస్తాను.

నాన్నా! కనీసం బి. ఏ. డిగ్రి ఏనా లేకపోతే ఎల్లా విజ్ఞానవంతుడి నవగలను? ఎల్లా లోకాన్ని తెలుసుకోగలను?

కష్టాలందరికీ వస్తూనే వుంటాయ్. అంత మాత్రంచేత వాటి ప్రభావాలకి లొంగి పోవడం ఏమంత మంచిదికాదు....

ఒక్క విషయం—నన్ను ప్రేమించే వాళ్లని నేను ప్రేమిస్తాను, నన్ను ప్రేమించని వాళ్లను నేను ప్రేమించగలను. నాకు ద్రోహం చేసేవాళ్లని నేను ప్రేమించను—ఎప్పటికీ ప్రేమించలేను—

.........తప్పకుండా చదివిస్తావని తలుస్తాను,

వందనాలతో, 'మీరామం'

ఉత్తరం రాయడం పూర్తైంది. ఇంకారాయవలసినవేమైనా వున్నాయేమోనని కాసేపాలోచించాడు. ఏంతట్టలేదు. మళ్లీ రెండుసార్లు చదివి, యింక రాయాల్సిందేమీలేదని నిర్ణయించుకున్న తర్వాత జాగ్రత్తగా మడిచి తండ్రి వాడుకునే టేబిల్ మీద పడేసి గబ గబా వెళ్లిపోయాడు బయటికి.

మళ్లీ రామ్మూర్తి యింటికొచ్చేప్పటికి మధ్యాహ్నంమూడు గంటలైంది. తండ్రి లోపల వున్నాడేమోనని అరుగెక్కి కిటికీలోంచి గదిలోకి చూశాడు టేబిల్దగ్గర తండ్రి చెప్పులు లేవు పెద్దచెల్లెలు బీరువా సర్దుతోంది. చిన్నచెల్లెలు ఏదో చదువుకుంటోంది, చివరకి తండ్రి లేడని నిర్ధారణ చేసుకున్న తర్వాత గబ గబా లోపలికి వెళ్లిపోయాడు. లోపలికెళ్లడంతోటే టేబిల్ కేసి పరీక్షగా చూశాడు, తనుపెట్టిన కాగితం లేదనే సంగతి తెలుసుకోగానే ఎందుకో గుండె దడదడలాడింది. ఐదునిముషాల తరవాత 'నాన్నిమ్మన్నాడం'టూ మడిచిన కాగిత మొకటి చేతికిచ్చింది చిన్నచెల్లెలు, రామమ్మూర్తికక్కడ చదవ బుద్ధి వెయ్యలేదు, గబ గబా తన గదిలోకి పోయి విప్పేడు—

'రాముడూ! నేనునిన్ను చదివించలేను ముమ్మాటికీ చదివించలేను, మనసంగతులు తెలియనివి కావు. మనకు తినడానికి సరిగా తిండిలేదు. కొంత

బట్టలు కట్టుకుని ఎన్నాళ్ళిందో నీకు తెల్సు అయినప్పటికీ ఎలాగో యింతవరకూ చదివించాను. యిప్పటికే అప్పులవాళ్ల బాధ భరించడం కష్టమై పోతోంది యిల్లాంటి సమయంలో ఎలా చదివించగలను? ఎక్కడనుంచి తెచ్చి చదివించగలను? ఒక్కసారాలోచించు!

కొద్దిగా ఆకలివేస్తే తట్టుకోవచ్చు ఆదే కొంచెం అధికంగా వేస్తే ప్రయత్నంమీద తట్టుకోవచ్చు ఆదే భరించలేనంతగా వేస్తే ఏంచెయ్యడం? ఎలా తట్టుకోడం?....అలాగే మనమిప్పుడు భరించలేనన్ని బాధల్లోవున్నాం. వీటిని నువ్వనుకున్నంత సులభంగా దాటలేం. నేనెప్పుడూ కష్టాలకిభయపడలేదు.అలాగే యిప్పుడు భయపడడంలేదు.వస్తూన్న నిరుత్సాహాన్నాపుకుంటూ ధైర్యంగా ఎదుర్కొంటున్నాను. ఐనా సంసారంగడవడంలేదు. కాగా రోజు రోజుకీ కష్టాలెక్కువై పోతున్నాయ్.

పెద్దపిల్లకి పద్ధెనిమిదేళ్లు దాటాయ్. యింకా పెళ్లి చెయ్యలేదు. అందుకే మనసంతా వెలేసినట్టు చూస్తూన్నారు. అప్పుడే రాధకూడా పెళ్లీడుకొచ్చింది. రెండోవాడి స్త్రీతం నెలజీతం పైసుతో కట్టేను. యీనెల జీతం యిప్పటివరకూకట్టలేదు. యివేళో, రేపో పేరు కొట్టేస్తారట ఇల్లాంటి కష్టాల్లోవున్నాం వీటన్నిటినీ ఎలా దాటగలం?

మనకున్న ఆస్తల్లా యీ యిల్లొక్కటే! ఇదమ్మితే మూడు వేలోస్తాయ్ రెండు వేలదాకా అప్పులే వున్నాయ్ మిగిలినవెయ్యితో పిల్లలపెళ్లిళ్లే చెయ్యనా? నీకు చదువే చెప్పించనా? సంసారమే గడపనా? ఏంచెయ్యమంటావ్?——

నువ్వు నిజంగా అదృష్టవంతుడవు, కనకనే యింతవరకూ చెప్పించాను సీతమ్మణ్ణి చూడు చదవుమాని యింట్లో కూర్చునే స్థితిపట్టింది. వాడి బ్రతుకెవరు చూస్తారు? వాడి భవిష్యత్తు కాధారమేమిటి?

రాముడూ! నాకిప్పుడేభై ఏళ్లున్నాయ్ కాని. యీ ఏభైసంవత్సరాలలోనూ, నూటేభై సంవత్సరాల వార్ధక్యాన్ననుభవిస్తున్నాను. నాకు నువ్వు తప్పితే ఆసరా ఎవ్వరూలేరు. నువ్వుకూడా ఏవో నాలుగు రాళ్లు సంపాదిస్తే కొంచెం సహాయకారిగా వుంటుంది నువ్వు బి. ఏ. చదవాలంటే ఉద్యోగం చేస్తూ చదువుకోవచ్చు.

ఒక్క విషయం - యీయింటికి పెద్దను నేను కాదు నువ్వే. వీళ్ళంతా నీబిడ్డలు. వీళ్ళని రక్షించే భారం కొంచెం నువ్వుకూడా భరిస్తావని తలుస్తాను.

తండ్రికి కొడుకుమీద ద్వేషముండదు రాముడూ! నువ్వు విజ్ఞానహీనుడవుకావు - చక్కగా చదువుకున్నావు - ఒకరుచెప్పవలసిన అవసరం లేదు - చక్కగా చదువుకున్న నువ్వు నీతమ్ముడు చదువుకునేందుకు సహకరిస్తావని తలుస్తాను - ప్రశాంతంగా ఆలోచించుకో,

దీవెనలతో

చదవడం పూర్తైంది - రామ్మూర్తికి మనసు డోలాయమానమైపోయింది - ఏడో జాలిమాటలు రాసి తండ్రి తనని మోసగించు తున్నాడనుకున్నాడు - అతనికి ఉచితంగా చదివితీరాలనివుంది - అప్పుడలతో అతని విచక్షణాజ్ఞానం వ్యర్థమైపోయింది తండ్రిమీద అర్థంలేని కోపంవచ్చింది - యింతి తండ్రితో ప్రస్తావించి లాభంలేదనుకున్నాడు - ఆరాత్రే అతను పారిపోయాడు-

తనిచ్చిన సమాధానం తనకొడుక్కెంత బాధ కలిగిస్తుందనీ, అతనివిద్యా విజ్ఞానం యీ విధంగా పారిపోయేందుకు ఉపయోగపడతాయనీ కల్లోకూడా అనుకోని రామ్మూర్తి తండ్రి జరిగిన సంఘటనకి చాలాబాధపడ్డాడు - చేతికర్ర విరిగి పోయినట్టు విలపించాడు - జీవితంమీద నిరాశ జనించింది. చచ్చిపోదా మనుకున్నాడు - కాని చచ్చిపోలేదు - తనకింకా బిడ్డలున్నారనీ, వాళ్ళని

పోషించి వృద్ధిలోకి తీసుకరావాల్సిన బాధ్యత తనమీదుందనీ అతని అంతరాత్మ ప్రబోధించింది- తనకొడుకు తప్పకుండా తిరిగివస్తాడనీ, తనను 'నాన్నా' అనిపిలుస్తాడనీ, కుటుంబ భారాన్ని కొంత వహిస్తాడనీ, ఆశపెట్టుకుని అలాగే సంసారాన్ని గడుపుతున్నాడు,

రోజులు నెలలు సంవత్సరాలు గడచిపోయాయి- రెండు సంవత్సరాలు గడిచినా రామ్మూర్తి రాలేదు - రామ్మూర్తితండ్రి మాత్రం రోజూ సాయంత్రమయేసరికి వీధరుగు మీద కూర్చుని ఎదురుగుండా వచ్చేపోయే యువకుల్లో తనకొడుకెక్కడేనా వున్నాడేమోనని ఆశాపూరిత నయనాలతో వెదుకుతూంటాడు - కానిరామ్మూర్తి ఎప్పుడూ కనపడలేదు- అంతమాత్రం చేతనిరుత్సాహపడి ఆయన చూడడమూ మానలేదు - ఆయన మనస్సు ఆధారంలేని ఆశతో పరితపించిపోతోంది - తనఆశ తప్పకుండా నెరవేరుతుందనే ఆశతో పట్టుదలతోఅల్లాగే కూర్చుని చీకటి పడే దాకా చూస్తూంటాడు పిచ్చివాడిలా. చీకటి పడిన తరవాత పెద్దకూతురొచ్చి "యింక లోపలికి రా నాన్నా" అంటూ చేయూ తనిస్తుంది.

"యీవేళా రాలేదమ్మా" అంటా డామె కేసి పిచ్చివాడిలా చూస్తూ. ఆ మాటతో, ఆ చూపుతో గుండెలు తరుక్కుపోతాయామెకు వస్తూన్న ఏడ్పు నాపుచేసుగుంటూ 'రేపొస్తాడునాన్నా' అంటుంది.

"అవునమ్మా రేపొస్తాడు" అంటూ ఆరోజుకు ఆఖరిసారిగా తన ఆశా పూరితనయనాలతో ఒకసారి రోడ్డుకేసి చూసి లోపలికి వెళ్లిపోతాడు.




శరీరము మీద
నొప్పులకు తక్షణమే
స్వస్థతనిచ్చుటకు
కెంప్‌వారి ఝటక్‌ముట్టో
బామ్ వాడుడు




గృహ చికిత్సలకు కెంప్‌వారి
ఔషధములు మిక్కిలి ప్రశస్తమైనవి

కెంప్ అండ్ కం. లిమిటెడ్
మాన్యుఫాక్చరింగ్ కెమిస్టులు
బొంబాయి · ఢిల్లీ · మద్రాసు · కలకత్తా